

సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

నిజామాబాద్
కామారెడ్డి

గురువారం 24 ఏప్రిల్ 2025 5 పేజీలు






# వేసవి సెలవుల్లో.. పిల్లలు జరభద్రం..

- ఆనందం మాటను పొంచి ఉన్న ప్రమాదం..
- ఈతకు వెళ్లి ప్రమాదాల బారిన..
- ఏటా పదుల సంఖ్యల్లో గాలిలో కలుస్తున్న ప్రాణాలు..
- పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి..

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి:0**

వేసవి సెలవులు రాగానే పిల్లల్లో ఎక్కడలేని సంతోషం కనిపిస్తుంది. ఈ సమయంలో వారు కాలక్షేపం కోసం చేసే పనులు ఊహించని ప్రమాదాలకు దారితీస్తుంటాయి. విద్యార్థులకు పాఠశాల యాజమాన్యాలు సెలవులు ప్రకటిం చింది ఇక వారి అల్లరికి హద్దే ఉండదు. ఈ సమయంలో తల్లిదండ్రులు సంరక్షకులు మరింత జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉంది. సెలవుల్లో కొందరు బంధువుల ఇళ్లకు వెళితే, మరికొందరు సమ్మర్ క్యాంపుల్లో చేరిపోతారు. ఇంకొందరు ఇంట్లోనే ఉండి సందడి చేస్తుంటారు. అయితే ఈ సమయంలో తెలిసి తెలియక చేసే సరదా పనులు ప్రమాదబారిన పడవేసే అవకాశం ఉంటుంది.

2లో



## బోధన్ డంపింగ్ యార్డ్‌లో వేయింగ్ మిషన్‌లో అక్రమాలు బట్ట బయలు

- వెయింగ్ మెషిన్ సీజ్, వెయిట్ ఇండికేటర్, సర్టిఫికెట్ స్వాధీనం

**సూర్య బోధన్**

బోధన్‌లోని డంపింగ్ యార్డ్ బయోమైనింగ్ లో జరిగిన అవినీతి వ్యవహారం గత కొన్ని రోజులుగా హాట్ టాపిక్‌గా మారింది. గురువారం డంపింగ్ యార్డ్‌లోని వెయింగ్ మిషన్‌లో అక్రమాలు బయటపడ్డాయి. డంపింగ్ యార్డ్‌లో బయో మైనింగ్ ప్రాసెసింగ్‌లో భాగంగా చెత్తను తూకం వేసే వెయింగ్ మెషిన్‌లో అనేక తేడాలు గుర్తించబడ్డాయి. వెంటనే ప్రభుత్వ లీగల్ అధికారి మహమ్మద్ సుజాత్ అలీ ఆ మెషిన్‌ను సీజ్ చేశారు. బరువు కొలతల కోసం జారీచేసిన అధికారిక సర్టిఫికెట్‌ను, వెయిట్ ఇండికేటర్ను కూడా స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా, మెషిన్‌కు సంబంధించిన వెయిట్ మాడ్యూల్‌ను కూడా (మిగతా 2లో)







పండుగ వాతావరణాన్ని తలపించిన

## రైతు మహోత్సవం వేడుక

- ఉత్సాహంగా పాల్గొన్న అన్నదాతలు
- ఆధునిక సాగుపై సలహాలు, సూచనలు అందించిన శాస్త్రవేత్తలు, నిపుణులు
- విశేషంగా ఆకట్టుకున్న వ్యవసాయ, అనుబంధ రంగాల స్టాళ్లు
- నూతన సాగు పద్ధతులపై అనుభవాలను పంచుకున్న ఆదర్శ రైతులు
- సందేహాలను నివృత్తి చేసుకున్న ఐదు జిల్లాల రైతులు
- కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఆయా కార్పొరేషన్ల చైర్మన్ల సందర్శన



**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 21 నుండి మూడు రోజుల పాటు నిర్వహించిన రైతు మహోత్సవం వేడుక బుధవారం సాయంత్రం నాటితో ముగిసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం విస్తృత (మిగతా 2లో)

## బిక్కనూరులో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

- మిస్టరీగా మారిన ఆత్మహత్య

**సూర్య- బిక్కనూర్**

బిక్కనూర్ మండల కేంద్రంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య బుధవారం పట్టణంలో కలకలం రేపింది. పట్టణానికి చెందిన రెడ్డి పూజ (17) జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ (మిగతా 2లో)



# వేసవి సెలవుల్లో.. పిల్లలు జరభద్రం...

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

వేసవి వచ్చిందంటే చాలు ఎక్కడో ఒకచోట "సరదాగా ఈతకు వెళ్లి నీట మునిగి మృతి" అనే ఘటనలు చూస్తూనే ఉంటాం. ఎండల్లో సేదతీరేందుకు, సరదా కోసం చెరువుల్లో, బావుల్లో,కుంటల్లో నీరు కనిపిస్తే పిల్లలు అందులోకి దిగుతుంటారు. దాన్ని లోతు తెలియక ప్రమాద బారిన పడుతుంటారు. రక్షించే క్రమంలో తోటి వారు ప్రమాదంలో పడతారు. అందుకే వేసవి సెలవుల్లో పిల్లల కదలికలపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలి..

### - చెరువుల్లో, బావుల్లో ఈతకు పంపించవద్దు..

పట్టణ ప్రాంతంలో ఉంటున్న వారు వారి పిల్లలను వేసవి సెలవుల్లో ఊర్లలోకి పంపిస్తుంటారు. అక్కడ వారూ సరదా కోసం బావులు చెరువులు కుంటల్లోకి ఈతకు వెళ్లే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఎండ వేడిని తట్టుకోలేక కొందరు పెద్దలు వెళుతుంటే వారి వెంట పిల్లలు కూడా వెళుతుంటారు. ప్రమాదవశాత్తు నీట మునిగినప్పుడు వారిని కాపాడే ప్రయత్నంలో ఈత వచ్చిన వారు కూడా మృతి చెందిన ఘటనలు చాలానే ఉన్నాయి. పిల్లలు ఎవరైనా ఈత నేర్చుకోవాలంటే నైపుణ్యం ఉన్న వారిని వెంట పంపించాలి. లేదా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్ లలో శిక్షణ ఇప్పించాలి

### - సిపిఆర్ పై అవగాహన ఉండాలి..

ఈతకు వెళ్లి నీట మునిగిన వారిని సురక్షితమైన ప్రదేశానికి తీసుకువచ్చి శ్వాస, పల్స్ లేకపోయినా సిపిఆర్ చేయాలి. చాతి భాగంలో ఒత్తిడి చేయాలి. నీరు ఎక్కువగా మింగితే పొట్టపై నెమ్మదిగా ఒత్తుతూ నీటిని కక్కించే ప్రయత్నం చేయాలి. నోటితో కృత్రిమ శ్వాస అందించాలి. అనంతరం వీలైనంత త్వరగా వైద్యుని వద్దకు తీసుకెళ్లాలి.

### - ఎండకు తీసుకోవలసిన జాగ్రత్తలు..

వేసవిలో ఎండ తీవ్రత పెరుగుతున్న క్రమంలో పిల్లలు ఇంట్లోనే ఉండేలా తల్లిదండ్రులు చూసుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే అనారోగ్యం బారిన పడతారు. వాతావరణం వేడిగా ఉండడంతో పిల్లల శరీర ఉష్ణోగ్రత పెరగడం, శరీరంలోని నీరు త్వరగా ఆవిరవడం వలన వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుంది. ఉదయం 11 తర్వాత పిల్లలను బయట తిరగనివ్వకూడదు. వారు ఆడుకోవడానికి ఉదయం, సాయంత్రం మాత్రమే అనుమతించాలి. పిల్లల ఆహార విషయంలో సైతం పలు జాగ్రత్తలు పాటించాలి.పండ్ల రసాలు, తేలికపాటి ఆహార పదార్థాలు ఇవ్వాలి. అలాగే ఎక్కువ నీటిని తాగేలా చూడండి. వీలైనంతవరకు ఎక్కువ సమయం వారితో గడిపేందుకు ప్రయత్నించండి.

# పండుగ వాతావరణాన్ని తలపించిన రైతు మహోత్సవం వేడుక

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాట్లు చేయగా, నిజామాబాద్ తో పాటు కామారెడ్డి, సిరిసిల్ల, నిర్మల్, జగిత్యాల ఐదు జిల్లాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పండుగ వాతావరణం కనిపించింది. వ్యవసాయ, అనుబంధ రంగాలకు చెందిన 130 కు పైగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రైతులు, వారు పండించిన ఉత్పత్తులతో పాటు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తులను, ఆధునిక సాగు పరికరాలు, అధిక దిగుబడులను అందించే వంగడాలు, మేలు జాతి పాడిపశువులు తదితర వాటిని స్టాళ్లలో ప్రదర్శించగా, రైతులు ఎంతో ఆసక్తితో తిలకించారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖ శాస్త్రవేత్తలు, నిపుణులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన యూనివర్సిటీ, ఇతర వ్యవసాయ పరిశోధనా కేంద్రాల శాస్త్రవేత్తలు మూడు రోజుల పాటు కొనసాగిన వర్క్ షాపులో ఆయా అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఏ.జానయ్య, వివిధ విభాగాల అధిపతులు శ్రీలత, అంజయ్య, చంద్రశేఖర్, ప్రవీణ్, శివకృష్ణ, శాస్త్రవేత్తలు రాజ్ కుమార్, శ్వేత, రాజశేఖర్, విజయ్, స్వప్న తదితరులు వివిధ రకాల పంటల సాగులో పాటించాల్సిన మెళుకువలు, సస్య రక్షణ చర్యలు, ఆధునిక వ్యవసాయం, భూసారం పెంపుదల, అధిక దిగుబడులను అందించే వంగడాలు, తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలను సాధించేందుకు అవలంభించాల్సిన పద్ధతులు, వాణిజ్య పంటల ఎంపికకు పరిశీలించాల్సిన అంశాలు తదితర విషయాలపై సెషన్ల వారీగా రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.



పురస్కారాలు అందుకున్న అభ్యుదయ రైతులతో పాటు రైతు ఉత్పాదక సంస్థల ప్రతినిధులు సైతం రైతు మహోత్సవం వేదిక ద్వారా తమ అనుభవాలు పంచుకున్నారు.

### - స్టాళ్లను సందర్శించిన కలెక్టర్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు

కాగా, చివరి రోజైన బుధవారం జిల్లా పాలనాధికారి రాజీవ్ గాంధీ హనుమంతుతో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి తదితరులు రైతు మహోత్సవ వేదిక, స్టాళ్లను సందర్శించారు. రైతులు, రైతు ప్రతినిధులతో మమేకం అయ్యి మూడు రోజుల పాటు కొనసాగిన ఈ కార్యక్రమం గురించి వారి స్పందనను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మహోత్సవ వేడుక నిర్వహించడం పట్ల హర్షాతిరేకాలు వెలిబుచ్చారు. సాగు విషయాలలో అనేక నూతన విధానాలు, సరికొత్త పద్ధతులు, ఆధునిక సాంకేతికత గురించి తెలుసుకోగలిగామని, రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డు గ్రహీతలైన అభ్యుదయ రైతుల అనుభవాలతో పాటు వ్యవసాయ, ఉద్యానవన విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, సైంటిస్టులు, నిపుణులు తమ పరిశోధనా అనుభవాలను, నేటి సామాజిక వ్యవసాయక స్థితిగతులను మేళవిస్తూ అనేక అంశాలపై అవగాహన కల్పించారని, పంటల సాగులో నూతన ఒరవడికి, అధిక దిగుబడుల సాధనకు ఈ మేళా ఎంతగానో దోహదపడుతుందని గట్టి నమ్మకాన్ని వెలిబుచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన నిజామాబాద్ జిల్లాలో రైతు మహోత్సవ వేడుక నిర్వహించడం వల్ల స్థానిక రైతులతో పాటు జిల్లాకు అనుకుని ఉన్న కామారెడ్డి, జగిత్యాల, సిరిసిల్ల, నిర్మల్ జిల్లాల రైతులకు కూడా ఇది ఎంతో ప్రయోజనం చేకూర్చిందని అన్నారు. ప్రస్తుత పరిస్థితులు, సామాజిక అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ, అనుబంధ రంగాలలో శాస్త్రవేత్తలు కనుగొన్న నూతన ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సాగు రంగంలో మెళకువలు, యాంత్రీకరణ తదితర అంశాలపై సైంటిస్టులు, నిపుణులు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అభ్యుదయ రైతులు వారి అనుభవాలను తోటి రైతులతో పంచుకున్నారని అన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలతో పాటు అనుబంధ రంగాల ఉత్పత్తులకు సంబంధించిన సుమారు 130 కు పైగా స్టాళ్లను రైతులు ఎంతో ఆసక్తిగా తిలకిస్తూ, ప్రయోగాత్మక పరిశీలన ద్వారా అవగాహనను పెంపొందించుకోగలిగారని కలెక్టర్ తెలిపారు. ఇక్కడ పరిశీలించిన అంశాలను, నూతన సాగు విధానాల గురించి రైతులు గ్రామాలలో సహచర రైతులకు తెలియజేస్తూ వారిని కూడా అధిక దిగుబడుల సాధన దిశగా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ రైతు మహోత్సవానికి ఎలాంటి అవరోధాలు తలెత్తకుండా విస్తృత ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలను అందుబాటులో ఉంచామని అన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, ఉద్యానవన శాఖ సంయుక్త సంచాలకులు శ్రీనివాస్ రావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

# గంజాయితో పట్టుబడ్డ యువకులు

**సూర్య,భీమ్‌గల్**

భీమ్‌గల్ మండలంలోని బడా భీంగల్ ఎంజీ తండా క్రాస్ రోడ్డు వద్ద అబ్కారి అధికారులు రూట్ వాచ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బైక్ కేటీఎం 200 పై 364 గ్రాముల ఎండుగంజాయి తీసుకొని వస్తున్న వారిని పట్టుకున్నారు. పట్టుకున్న వీరిని విచారించగ గంజాయి బానిసలుగా మారిన మరి కొంత మందిని గుర్తించడం జరిగింది. గంజాయి బానిసలుగా మారిన వారిలో మైనర్లు ఎక్కువగా ఉండడంతో వీరికి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో తల్లి, తండ్రుల పర్యవేక్షణ లో అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు. గంజాయి తో దొరికిన ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి కోర్ట్ కు రిమాండ్ చేసినట్టు అబ్కారి సీఐ తెలిపారు. విలేకరుల సమావేశంలో అబ్కారి సీఐ వేణుమాధవ్ రావు, ఎస్సై గోవర్ధన్, హెడ్ కాన్స్టేబుల్ ఫయాజ్, పాఠన్, కాన్స్టేబుల్స్ దత్తాద్రి, శ్రీనివాస్ రెడ్డి, లింబాద్రి, జగదీశ్, ప్రవంతి, రాణి, సుధీర్, రాజేశ్వర్, మహేష్ ఉన్నారు.



# బోధన్ డంపింగ్ యార్డ్‌లో వేయింగ్ మిషన్‌లో అక్రమాలు బట్ట బయలు

(మొదటి పేజీ తరువాయి)

అధికారులే స్వాధీనం చేసుకున్నారు. సంఘటన స్థలంలోనే పంచనామా రిపోర్ట్ నమోదు చేశారు. చట్టపరంగా వీరిపై రెండు సెక్షన్ల కింద కేసు కూడా నమోదు చేయడం జరిగింది. జరిమానా కూడా విధించారు. దర్యాప్తులో గవర్నమెంట్ తూనికలు కొలతలు అధికారులు వేసిన గుర్తింపు సీల్ లేకపోవడం, చట్టపరమైన బ్యాచ్ నెంబర్ లేకపోవడం కూడా బయటపడింది. రాష్ట్రంలోని ఏ ప్రాంతంలో అయినా ఇలాంటి అక్రమ వెయింగ్ మెషిన్లు లేదా వాడకాలు ఉంటే, అక్కడ కూడా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కేసులో ప్రైవేట్ కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి, జరిమానా విధించారు.డంపింగ్ యార్డ్ లోని వేయింగ్ మిషన్ ని మున్సిపల్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ లోపం వలన జరిగిన తూకం అక్రమాలకు మునిసిపల్ అధికారులు ఎలాంటి సమాధానం చెపుతారో అని ఎదురుచూస్తున్నరు.కొన్ని రోజుల క్రితం కూడా ఇదే డంపింగ్ యార్డ్‌లో వ్యర్థాలకు నిప్పుపెట్టడం వల్ల బోధన్‌లో తీవ్రమైన పర్యావరణ కాలుష్యం వ్యాపించి ప్రజలకు ఇబ్బంది కలిగింది.

# లింగంపేటలో మహిళా దారుణ హత్య

### - డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు

**సూర్య,లింగంపేట్**



లింగంపేట్ మండల కేంద్రంలో అమ్ములు లక్ష్మి 45 అనే మహిళ దారుణ హత్యకు గురైంది.స్థానికులు లింగంపేట్ ఎస్సై వెంకట్రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి లింగంపేట్ గ్రామానికి చెందిన అమ్ములు లక్ష్మి భర్త చనిపోవడంతో తన ఇంటిలో ఒకతే ఉంటూ కూలి పని చేసుకుంటూ జీవిస్తుందన్నారు.ఈనెల 22 రోజున రాత్రి సమయంలో చుట్టు పక్కల వారు ఆమె ఇంటికి తాళం వేసి ఉన్న ఇంటిలో నుండి దుర్వాసన వస్తుండడంతో లక్ష్మి కూతురు శిరీష,ఆమె భర్తకు సమా చారం ఇవ్వగా బుధవారం వారు వచ్చి తాళం పగలగొట్టి చూడగా నిజ ంగానే అమ్ములు లక్ష్మిని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చీరతో ఉరిబిగించి చంపినట్లు ఉందని తెలిపారు. మృతురాలి కూతురు శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగిందన్నారు.సంఘటన స్థలానికి ఎల్లారెడ్డి సిఐ రవీందర్ నాయక్ పోలీస్ బృందంతో చేరుకొని డాగ్ స్క్వాడ్ రప్పించి తనిఖీలు చేపట్టారు.

### రైతు మహోత్సవం స్టాళ్లను సందర్శించిన పోలీస్ కమీషనర్

**సూర్య ఇందూర్**




జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (Giriraj Government Degree College) మైదానంలో మూడు రోజులపాటు నిర్వహించిన రైతు మహోత్సవం బుధవారం ముగిసింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహించారు. నిజామాబాద్, కామారెడ్డి, సిరిసిల్ల, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్టాళ్లను సందర్శించారు. అధిక దిగుబ డులను అందించే వంగడాలు, మేలు జాతి పాడి పశువులు, సాగు పరిక రాలు, వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తులను తిలకించి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. రాష్ట్రంలోని పలు యూనివర్సిటీల శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు వివిధ రకాల పంటల సాగులో పాటించాల్సిన మెలకువలు, సస్యరక్షణ చర్యలు, ఆధునిక వ్యవసాయం, భూసారం పెంపుదల, అధిక దిగుబడులను అందించే వంగడాలు, తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు తదితర అంశాలను క్షుణ్ణంగా వివరించారు. చివరి రోజు సందర్భంగా నిజామాబాదు పోలీస్ కమీషనర్ శ్రీ పి. సాయి చైతన్య, %ఖూా%. రైతు మహోత్సవం స్టాళ్లను సందర్శించారు.

# బిక్కనూరులో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతుంది. నిన్న పరీక్ష ఫలితాలలో ఫెయిల్ కావడంతో నిన్నటి నుండి మనస్థాపంతో ఉన్న పూజ రాత్రి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దగ్గరలోనే ఉన్న తన పెద్దమ్మ ఇంటికి వెళ్ళింది. ఉదయం ఇంటి ముందు శుభ్రం చేసి వస్తానని చెప్పి ఇంటికి వచ్చిన పూజ తిరిగి రాకపోవడంతో పూజా పెద్దమ్మ కుటుంబ సభ్యులు ఇంటికి వెళ్లి చూడగా కాలిన గాయాలతో విగితజీవిగా మారిఉంది. దీంతో స్థానికులకు సంవత్సరం అందించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కాలిన గాయాలతో అప్పటికే మృతి చెందిన పూజను కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి పంచనామా నిమిత్తం తరలించారు. కాగా పూజకు తల్లిదండ్రులు లేకపోవడంతో చిన్నప్పటినుండి నానమ్మ వద్దే ఉంటుంది. కాగా తన నానమ్మ మంగళవారం బంధువుల ఇంటికి వెళ్లడంతో ఒంటరిగా ఉన్న పూజ పరీక్ష రిజల్ట్ లో ఒక సబ్జెక్టులో ఫెయిల్ అవ్వడంతో మనస్థాపం చెంది మృతి చెందినట్లు స్థానికులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ పంచనామా రిపోర్ట్ వచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తానని చెప్పారు. కాగా బాలిక మృతి మిస్టరీగా మారింది.

# సాలురలో ఘనంగా బుద్దే రాజేశ్వర్ విగ్రహ ప్రతిష్ఠాపన

**సూర్య బోధన్**



నిజామాబాద్ జిల్లా, సాలూర మండలం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు బుద్దే రాజేశ్వర్ విగ్రహాన్ని బుధవారం సాలూర మండలంలోని బైపాస్ రోడ్డులో, హనుమాన్ మందిరం మార్గంలో అత్యంత వైభవంగా ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాన్సువాడ శాసనసభ్యులు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బుద్దే రాజేశ్వర్ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారని, ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండి పోతాయని కొనియాడారు. అంతేకాకుండా విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి సహకరించిన దాత రాజు సార్‌ని ఆయన ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, పలువురు ఇతర ప్రముఖులు, నాయకులు, రాజేశ్వర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారంతా బుద్దే రాజేశ్వర్‌కి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాజేశ్వర్ సేవలు రాజకీయాలకు అతీతంగా, మానవతా విలువలకు అద్దంపట్టేలా సాగినవని ప్రశంసించారు. ఆయన నిస్వార్థమైన సేవానిరతిని, ప్రజల పట్ల ఆయనకున్న అంకితభావాన్ని వారు గుర్తు చేసుకున్నారు. సాలుర మండల ప్రజలు తమ ప్రియతమ నాయకుడికి ఘనంగా నివాళు లర్పించడం కార్యక్రమంలో ప్రత్యేకంగా కనిపించింది. విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమం బుద్దే రాజేశ్వర్ గొప్పతనాన్ని, ఆయన ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయారనడానికి నిదర్శనంగా నిలిచింది....

## మహనీయుల జయంతిని విజయవంతం చెయ్యండి..

**సూర్య- నవీపేట్**



ఈ నెల 30న బోధన్‌లో జరిగే మహనీయుల జయంతి వేడుకలు విజయవంతం చేయాలని ఎస్సి, ఎస్టీ పరిరక్షణ కమిటీ సభ్యులు పిలుపు నిచ్చారు.మండలకేంద్రంలో మహనీయులజయంతి కి సంబంధించిన పోస్టర్ లను బుధవారం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా బోధన్ డివిజన్ ఎస్సి, ఎస్టీ పరిరక్షణ కమిటీ కన్వీనర్ నిరడి ఈశ్వర్ మాట్లాడుతు.. ప్రతి సంవత్సరం దేశం లో ఎక్కడ లేని విధంగా ఏప్రిల్ నెలలో వచ్చే మహనీ యుల జయంతి ని బోధన్ లో జరుపుకోవడం జరుగుతుందన్నారు. అందు లో భాగంగా ఈ నెల 30 న బోధన్ అంబెడ్కర్ చౌరస్తా లో సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమనికి జాతీయ దళిత సంఘాల నాయకులు ముఖ్య అతిథులుగా జీబి రాజు, గాలి వినోద్ కుమార్,ప్రసన్న హరికృష్ణ, అసిస్టెంట్ ప్రొపెసర్ లు హాజరు కానున్నారని బహుజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని కోరారు. ఈ కార్య క్రమం లో ఎస్సి, ఎస్టీ పరిరక్షణ కమిటీ సలహాదారులు కొండ్ర వెంకటి, నిరడి రవి, సురేందర్, కామయ్య, తదితరులు పాల్గొన్నారు



## మాజీ సర్పంచ్ కుమార్తె వివాహానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

**సూర్య ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్లో బుధవారం జరిగిన ఎల్లారెడ్డి మాజీ సర్పంచ్ బత్తిని దేవేందర్ కుమార్తె వివాహ మహొత్సవానికి ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించినారు ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ వెంట మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 5వ వివాహ వార్షికోత్సవం శుభాకాంక్షలు..

**సూర్య రాజంపేట**

రాజంపేట మండలంలోని అరగొండ గ్రామీణానికి చెందిన ప్రభాకర్ %ఒ% సునీత దంపతుల 25వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా హార్దిక శుభాకాంక్షలు. మీరు మరిన్ని సంవత్సరాలు ఆనందంగా, ఆరోగ్యంగా కలిసి జీవించాలని కోరుకుంటున్నాను అని పందరి నాధ్ తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ సూర్య నర్సింలు పలుగాని శుభాకాంక్షలు తెలిపారు.





## పలు శుభకార్యాలలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజిత వెంకటరామిరెడ్డి

**సూర్య ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్ దేవేందర్ కుమార్తె వివాహం ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్లో బుధవారం ఘనంగా జరిపారు వారి ఆహ్వానం మేరకు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజిత వెంకటరామిరెడ్డి ,సొసైటి వైస్ చైర్మన్ మత్తామాల ప్రశాంత్ గౌడ్ లు వధూవరులను ఆశీర్వదించారు అనంతరం అన్నాసాగర్ గ్రామానికి చెందిన కృష్ణ రెడ్డి కుమార్తె వివాహం లింగంపేట్ ఫంక్షన్ హాల్ ఘనంగా జరిపారు వారి వివాహానికి విచ్చేసి వారికి కూడా శుభాకాంక్షలు తెలియజేసారు. అదేవిధంగా, పోసంపల్లి గ్రామానికి చెందినటువంటి మాజీ కోఆప్షన్ మేంబర్ లింగం కుమారుని వివాహం గాంధారి మండల కేంద్రంలో మారుతి ఫంక్షన్ హాల్లో ఘనంగా జరిపారు అక్కడికి కూడా హాజరై వధువరులని ఆశీర్వదించారు వీరి వెంట మాజీ జెడ్పిటిసి సామెల్ , మాజీ జడ్పిటిసి ఉషా గౌడ్, పిఎసిఎస్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ గౌడ్ మాజీ సర్పంచ్ తిమ్మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సంతోశ్ , శకావత్ అలీ, ముజిబ్ ,యూత్ ప్రెసిడెంట్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు

## వరంగల్ సభను విజయవంతం చేయాలి

**- మాజీ ఎమ్మెల్యే సురేందర్**

**సూర్య,లింగంపేట్**



ఈ నెల 27న వరంగల్ లో జరిగే బిఆర్ఎస్ పార్టీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ శ్రేణులకు ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పిలుపునిచ్చారు.ఆయన బుధవారం లింగంపేట్ మండల కేంద్రంలోని జిఎన్ఆర్ గార్డెన్ లో బిఆర్ఎస్ ముఖ్య శ్రేణులకు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అచ్చే ప్రభుత్వం బిఆర్ఎస్ పార్టీ దేనని ప్రతి కార్యకర్త పార్టీకి కష్టపడి పని చేయాలని అన్నారు.కాంగ్రెస్ పార్టీని జనాలు నమ్మే పరిస్థితి లేదన్నారు.బిఆర్ఎస్ కార్యకర్తలు, పార్టీ శ్రేణులు సంయమనంతో ఉండాలన్నారు. వరంగల్ సభకు ప్రజలు స్వచ్ఛందంగా రావడానికి ముందుకొస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దివిటీ రమేష్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అశోక్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి,ముదాం సాయిలు,గన్ను నాయక్,రూప్ సింగ్, నాయకులు,కార్యకర్తలు, పాల్గొన్నారు

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో ముగ్గురికి జైలు శిక్ష

**సూర్య రెంజల్ :**

మండలంలోని సాటాపూర్ ఎక్స్ రోడ్లో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో ముగ్గురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పట్టుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు వివరాల్లోకి వెళ్తే చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా మహారాష్ట్రలోని బెంగళూరు గ్రామానికి చెందిన శివాజీ రౌటే, తాడిబిలోలి గ్రామానికి చెందిన షేక్ హైదుకు రెండు రోజుల జైలు శిక్ష, మరో వ్యక్తి వీరన్న గుట్ట ప్రాంతానికి చెందిన వీరభత్తుల సాయిలు కు ఒకరోజు జైలు శిక్షలను సెకండ్ క్లాస్ జడ్జి శ్రీ శేష తల్ప సాయి విధించినట్లు ఎస్సై తెలిపారు. ఇంకొకరికి నాలుగు వేల రూపాయల జరిమానా విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన ఆత్మకూరు విద్యార్థిని

**సూర్య, నాగిరెడ్డిపేట్**



ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో మండలంలోని ఆత్మకూరు గ్రామానికి చెందిన విద్యార్థిని కులకర్ణి స్ఫూర్తి 462 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ఏడవ ర్యాంకు సాధించింది. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూప్ లో 470 మార్కులకు గాను 462 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించినట్లు విద్యార్థిని తండ్రి చంద్రశేఖర రావు తెలిపారు. కులకర్ణి స్ఫూర్తి పదవ తరగతి వరకు ఎల్లారెడ్డి లోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో చదివి ఇంటర్మీడియట్ హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతోంది స్ఫూర్తి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాలలో రాష్ట్ర స్థాయి ఏడవ ర్యాంకు రావడం పట్ల విద్యార్థిని తల్లిదండ్రులతో పాటు విద్యార్థిని పూర్వ పాఠశాల ఉపాధ్యాయులు., మండల ప్రజలు అభినందిస్తున్నారు.

## సెలవుల్లో పిల్లలను గమనిస్తూ ఉండాలి

**- ఎస్ఐ రాజశేఖర్**

**సూర్య మాక్లూర్**

నేడు 24 నుండి పాఠశాలలకు వేసవి సెలవులు ఉండటంతో విద్యార్థులు సరదాగా చెరువులు, బావుల వద్దకు ఈత,స్నానం చేయడానికి వెళ్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఎస్ఐ రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు పిల్లల కదలికలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని,సెల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని,మైనర్ బాలురకు ద్విచక్ర వాహనలు ఇవ్వకూడదన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల స్థలాలను పరిశీలించిన ఎంపీడీవో గంగాధర్

**సూర్య నిజాంసాగర్**



మండలంలోని అచ్చంపేట, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేసిన లబ్ధిదారుల ఇండ్ల స్థలాలను నిజాంసాగర్ ఎంపీడీవో గంగాధర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు నూతనంగా ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునేందుకు అర్హులైన వారిని ఎంపిక చేసిన లబ్ధిదారులకు సంబంధించిన స్థలాలు పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు గ్రామస్తులు ఉన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో ఎస్ఎస్ఆర్ విద్యార్థుల హవా




**సూర్య ఇందూర్:**

ఇంటర్మీడియెట్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు.సెకండియర్ ఎంపీసీలో నాగిశెట్టి విష్ణు 959/1000, శ్రీరామ్ వెంకటేశ్ 949/1000 మార్కులు సాధించారు. అలాగే ఫస్టియర్ ఒకేషనల్ ఎంఎల్టీలో అర్బియానాజ్ 483/500, అబ్దుల్ నబీర్ 469/500 మార్కులు సాధించారు. ఎంపీహెచ్ డబ్ల్యూ(ఎఫ్) సెకండియర్ లో సంగెం సుమ 450/500 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ర్యాంకు కైవసంచేసుకుంది.ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎస్-ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్: ఎం.మారయ్యగౌడ్ అభినందించారు.క్రమశిక్షణ, ప్రణాళికాబద్ధమైన చదువును తమ విద్యా సంస్థలు ప్రోత్సహిస్తాయని ఆయన అన్నారు. నాన్ రెసిడెన్షియల్ కళాశాలలో రాష్ట్ర,జిల్లా స్థాయి మార్కులను తమ కళాశాల విద్యార్థులు సాధించడం గర్వంగా ఉందని పేర్కొన్నారు.కార్యక్రమంలో డైరెక్టర్ ఎం.హర్షిత్ గౌడ్, ప్రిన్సిపాల్ రవీందర్ గౌడ్, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలలో ఫేర్వెల్ పార్టీ

**సూర్య మోర్తాడ్**

మోర్తాడ్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫేర్వెల్ పార్టీని విద్యార్థిని, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. డిగ్రీ కళాశాలలో థర్డ్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు ఫస్ట్ ఇయర్ మరియు సెకండ్ ఇయర్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఫేర్వెల్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ లు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ పెద్దన్న విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. అనంతరం ప్రిన్సిపాల్ పెద్దన్న విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి అంకితభావంతో, క్రమ శిక్షణతో, చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా బి ఏ, బి కం, బి ఎస్ సి ఎంపీసీ, బీఎస్సీ బి జెడ్ సి, ఫస్ట్ ఇయర్ మరియు సెకండ్ ఇయర్లో




ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి 'గోల్డ్ మెడల్' ప్రశంస పత్రం విద్యార్థులకు అందజేశారు. వారి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జి. కీర్తన, జి. మానస, యు. శాలిని, సిహెచ్. సుప్రజ, సిహెచ్. గాయత్రి, కె. మధు, ఎం.సరస్వతి, జే. సాయి తేజ లు ఉన్నారు. ప్రతి సంవత్సరం ఇదే విధంగా విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేయడం జరుగుతుందని పెద్దన్న స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా క్రీడాల్లో ప్రతిభ కనబరిచిన యు. శివాని, బి. రచన కు 'గోల్డ్ మెడల్' తో సత్కరించి ప్రశంస పత్రం అందజేశారు. ఈ మధ్యకాలంలో రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులుగా అవార్డు పొందిన కళాశాల ప్రిన్సిపాల్ పెద్దన్నను కళాశాల విద్యార్థులు శాలువాతో సత్కరించి, పూలమాలతో సన్మానించారు. విద్యార్థులతో పాటు అధ్యాపక బృందం సైతం పెద్దన్న ను సన్మానించి, కృతజ్ఞతలు తెలియజేశారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఈ సంవత్సరం మా కళాశాలకు రావడం చాలా సంతోషంగా ఉందని, ఉపాధ్యాయ బృందం తెలియజేశారు. సంకల్పబలం, పట్టుదల, కృషి, ఉంటే ఏదైనా సాధించవచ్చునని, విద్యార్థులను ఉద్దేశించి పెద్దన్న పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మగ్రిపల్లి భూపతి, కోఆర్డినేటర్ యు. దశరథ్, సీనియర్ అధ్యాపకులు ఎన్. రాజన్న, టి. రవీందర్, కళాశాల సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను టీవీ, ఫోన్ లకు దూరంగా ఉంచండి.

**- విద్యాశాఖఅధికారి అశోక్.**

**సూర్య -బాన్సువాడ**



పిల్లలను టీవీ,ఫోన్లకు దూరంగా ఉంచాలనిజిల్లావిద్యాశాఖఅధికారి అశోక్ సూచించారు.బుధవారం బాన్సువాడ మండలం బోర్లం ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ హాజరయ్యారు.ఈ సందర్భంగా అశోక్ తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఇంటి వద్ద చదువడం, రాయడం అనేది నిరంతరం చేసేవిధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. టీవీ లకు,సెల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని,వాటి వల్లనే విద్యార్థుల చురుకుదనం తగ్గుతుందని, చదువే విద్యార్థుల భవిష్యత్తున ునిర్ణయిస్తుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివించాలని, తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల కోసం మౌలిక వసతులు కల్పిస్తుందని వాటన్నిటినీ సక్రమంగాఉపయోగించుకోవాలని అన్నారు. అనంతరం1వ తరగతి నుండి 5తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రగతి పట్టాలను అందజేశారు. కార్యక్రమంలోకాంప్లెస్ ప్రధాన ఉపాధ్యాయులు వెంకటరమణ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపి, ఉపాధ్యాయులు అయ్యల సంతోష్,చైతన్య,సత్యనారాయణ పాల్గొన్నారు.

## భవన నిర్మాణ రంగాల కార్మిక శాఖ ఆధ్వర్యంలో బాన్సువాడ లో చలివేంద్రం ఏర్పాటు

**- అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎం.కోటేశ్వరావు.**

**సూర్య ఎల్లారెడ్డి**

బాన్సువాడ పట్టణ కేంద్రంలోని తాడుకోల్ చౌరస్తాలో భవన ఇతర నిర్మాణ రంగాల కార్మిక శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు కార్మిక నాయకుడు అబ్దుల్ రజాక్ ఒక ప్రకటనలో తెలిపారు బుధవారం ఉదయం బాన్స్ వాడ పట్టణ కేంద్రంలో ప్రారంభించినట్లు తెలిపారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కామారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎం కోటేశ్వరరావు చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు , కార్మిక నాయకుడు అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ ఎండాకాలం ను దృష్టిలో ఉంచుకొని కార్మికుల కొరకు సామాన్య ప్రజల దాహార్తి తీర్చడం కొరకు భవన ఇతర నిర్మాణ రంగాల కార్మిక శాఖ చల్లనీ నిటీ కొరకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ చలివేంద్రంతో ప్రజలు, బాటసారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో స్థానిక అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మహమ్మద్ ఇబ్రహీం ,జుబేర్ జూనియర్ అసిస్టెంట్ సతీష్ రెడ్డి ,షేక్ దావూద్, కార్మిక నాయకులు అబ్దుల్.రజక్ నమ్లమెట్.సాయిలు పాటు కార్మికులు పాల్గొన్నారు.





## ఉగ్రవాదులకు ఉరి శిక్ష విధించాలి

**సూర్య - మోపాల్,**

పహాల్ గాం లో టూరిస్టులను హతమార్చిన ఉగ్రవాదులను పట్టుకొని ఉరిశిక్ష విధించాలని అమరవీరుల పార్క్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేసారు. మరణించిన టూరిస్టులకు బుధవారం, నిజామాబాద్ నగరంలోని వినాయకనగర్ లో ఉన్న పార్క్ లో నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దాడిలో గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జమ్మూ కాశ్మీర్ లో ఉగ్రకలపాలను పూర్తిగా నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన రాష్ట్ర అధికారి

**సూర్య- బిక్కనూర్**



మండల కేంద్రంతో పాటు మండలంలోని బస్వాపూర్ వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాలను బుధవారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ అధికారి ఫణిందర్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరి ధాన్యపు కొనుగోలు ఎలా జరుగుతుందని, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు మౌలిక వసతులు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. రైతుల కోసం కొనుగోలు కేంద్రం వద్ద త్రాగునీటితోపాటు టెంటు సౌకర్యాలు కల్పించినట్లు సొసైటీ సిబ్బంది వివరించారు. అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్మిల్లకు తరలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో సొసైటీ చైర్మన్ గంగల భూమయ్య, జిల్లా సహకార అధికారి రామ్మోహన్, క్లస్టర్ అధికారి రమేష్, డిటి కిష్టయ్య, మానిటరింగ్ అధికారి నగేష్, సొసైటీ సీఈవో నరసింహులు రైతులు ఉన్నారు

## ఉగ్రదాడి హేయమైన చర్య

**సూర్య ఇందూర్**



జాతి ఐక్యతను చాటుదాం పహాల్గాం లో రాక్షసుల రాక్షసకాండను భారతజాతి ముక్తకంఠంతో నిరసన తెలపాలని న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ ఒక ప్రకటనలో కోరారు.భరతభూమిపై పాక్ ప్రేరిత ఉగ్రవాదుల భరతం పట్టాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.అమాయక హిందూ ప్రజలను అమానుషంగా హత్యచేసిన, చేయించిన వారి అంతు చూడాలని ఆయన అన్నారు. పహాల్గాం ఘటనకు సంఘీభావంగా జాతి ఐక్యత చాటాలని జగన్ కోరారు.

## విశ్వామితిని సన్మానించిన ఎస్ఆర్ గాయత్రి కళాశాల జోనల్ ఇంచార్జ్

**సూర్య రాజంపేట**



ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విశ్వామితిని %ూ=% గాయత్రి కళాశాల జోనల్ ఇంచార్జ్ శ్రీనివాస్ సన్మానించారు. రాజంపేట గ్రామానికి చెందిన ఈమె హైదరాబాద్‌లోని %ూ=% గాయత్రి కళాశాలలో చదువుతూ 461 మార్కులు సాధించి, కామారెడ్డి జిల్లా పేరును రాష్ట్ర స్థాయిలో నిలిపారు. బుధవారం కామారెడ్డి జిల్లా పీఆర్వో శ్రీకాంత్ తో కలిసి జోనల్ ఇంచార్జ్ శ్రీనివాస్ శాలువాతో సత్కరించి, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినికి అభినందనలు తెలిపారు...

## బైపీసీ లో మెరిసిన సిరివెన్నెల

**సూర్య రాజంపేట**



రాజంపేట మండల కేంద్రానికి చెందిన చింతల సిరివెన్నెల ఇంటర్ బైపీసీ ద్వితీయ సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించి కుటుంబానికి, గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. వెయ్యి మార్కులకు గాను 850 మార్కులు సాధించిన ఆమె తన కృషితో, పట్టుదలతో మంచి ఫలితాన్ని సాధించింది. చదువులో నిరంతరం కృషి చేసి తన లక్ష్యాన్ని చేరుకుంది. సిరివెన్నెల తండ్రి చింతల శ్రీనివాస్ ఒక సాధారణ రైతు. వ్యవసాయంతో జీవనం సాగిస్తూ, పిల్లల చదువులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారి భవిష్యత్తు కోసం అన్ని విధాలుగా మద్దతుగా నిలిచారు. ఇద్దరు పిల్లలు కూడా అదే బైపీసీ గ్రూప్ చదువుతుండగా, వారు ఇద్దరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ విజయం వెనుక తల్లిదండ్రుల త్యాగం, విద్యార్థినీ సిరివెన్నెల కృషి, విద్యాప్రతిష్ఠాన సహకారం కనిపిస్తాయి. ఈ సందర్భంగా విద్యార్థినికి గ్రామస్థులు, బంధువులు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మెరుగైన విద్యను అభ్యసించి మంచి డాక్టర్ కావాలన్నదే ఆమె లక్ష్యం.




## పాకిస్తాన్ ది పిరికిపంద చర్య

**సూర్య,భీమ్‌గల్**

కాశ్మీర్ పర్యటన కు వచ్చిన వారిపై కాల్పులు జరిపిన పాకిస్తాన్ టెర్రరిస్ట్ లది పిరికిపంద చర్య అని బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబెర్ యోగేశ్వర్ నర్సయ్య అన్నారు. కాశ్మీర్ పహాల్గామ్ టెర్రరిస్ట్ దాడుల్లో అసువులు బాసిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ బుధవారం సాయంత్రం పట్టణంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ర్యాలీ బడా భీంగల్ చౌరస్తా నుండి సుదర్శన్ టాకీస్ వరకు సాగింది. ర్యాలీ లో పాకిస్తాన్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాకిస్తాన్ డౌన్, డౌన్, భారత్ మాత కి జై అంటూ నినాదాలు చేశారు. పాకిస్తాన్ కు భారత ప్రభుత్వం తగిన రీతిలో బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు. పహాల్గామ్ వ్యాలీ లో విహార యాత్ర కు వెళ్లిన వారిలో హిందువులను లక్యంగా చేసుకుని కాల్పులు జరుపడం, కాల్పుల్లో 27 మంది చనిపోవడం హిందువుల కు హెచ్చరిక లాంటిదని అన్నారు. హిందువులు కుల, మతాలకు అతీతంగా ఏకం అవ్వాలని, లేకుంటే భవిష్యత్తు దారుణం అయ్యే అవకాశం ఉందన్నారు. బస్టాండ్ లో టెర్రరిస్ట్ దాడుల్లో మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు, హిందువులు పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్

**సూర్య రెంజిల్ :**

పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేసి పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు వివరాల్లోకి వెళితే మండలంలోని దూపల్లి గ్రామాలలో కల్లు దుకాణం సమీపంలో పేకాట ఆడుతున్న స్థావరంపై సమాచారం మేరకు దాడి చేయగా ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. వారి వద్ద నుండి నగదు 11820 రూపాయలు తో పాటు 52 పేక ముక్కలను స్వాధీనం సీజ్ చేసి అరెస్టు చేయడం జరిగిందన్నారు. పేకటరాయుళ్ల పటాన్, పోచయ్య, పవన్, మల్లేష్, గంగాధర్ అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ కు పంపనున్నట్లు ఎస్సై తెలిపారు.

# స్టేట్ మార్కులతో కాకతీయ ప్రభంజనం...

**సూర్య ఇందూర్:**




మంగళవారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో కాకతీయ విద్యా సంస్థల విద్యార్థుల స్టేట్ మార్కులతో తమ సత్తా చాటారని కాకతీయ విద్యా సంస్థల చైర్మన్ సీహెచ్. విజయ లక్ష్మీ తెలిపారు. ఇంటర్ సెంకడ్ ఇయర్ ఫలితాల్లో సఫా అఖీల్ ఎంపీసీలో 992/1000 మార్కులతో స్టేట్ మూడో ర్యాంకు, త్రిషా చౌదరి 991/1000మార్కులతో స్టేట్ ఐదో ర్యాంకు, ఆయేషా ఫాతిమా ఎంపీసీలో 988/1000 మార్కులతో స్టేట్ ఏడో ర్యాంకు, ఎం.లోకేష్ ఎంపీసీలో 987/1000 మార్కులతో స్టేట్ ఎనిమిదో ర్యాంకు, టి.శ్రీలేఖ ఎంపీసీలో 987/1000 మార్కులతో స్టేట్ ఎనిమిదో ర్యాంకు సాధించారని తెలిపారు. అంతుల్ హది హెప్రీనా బైపీసీలో 992/1000 మార్కులతో స్టేట్ మూడో ర్యాంకు, జునరియ అంబర్ బైపీసీలో 992/1000 మార్కులతో స్టేట్ మూడో ర్యాంకు, సోహ సనలియా బైపీసీలో 988/1000 మార్కులతో స్టేట్ ఎనిమిదో ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. అన్మోల్ సర్వత్ ఎంఈసీలో 983/1000 స్టేట్ ర్యాంకు, ఎస్.వేధిక సీఈసీలో966/1000 మార్కులతో స్టేట్ ర్యాంక్ సాధించారని తెలిపారు.ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాలలో బి.కావ్యశ్రీ ఎంపీసీలో 467/470 మార్కులతో స్టేట్ రెండో ర్యాంకు, ఎం.హర్షత ఎంపీసీలో 466/470 మార్కులతో స్టేట్ మూడో ర్యాంకు, టి. నిత్యశ్రీ ఎంపీసీలో 466/470 మార్కులతో స్టేట్ మూడో ర్యాంకు, ఎం.మ్రుదుల 466/470 మార్కులతో స్టేట్ మూడో ర్యాంకు, బి. లాస్యశ్రీ 466/470 మార్కులతో స్టేట్ మూడో ర్యాంకు, కె. కీర్తి 465/470 మార్కులతో స్టేట్ నాలుగో ర్యాంకు, ఎం.అశ్రిత 465/470 మార్కులతో స్టేట్ నాలుగో ర్యాంకు సాధించారని తెలిపారు. హనియా ఉమేమా బైపీసీలో 435/440 మార్కులతో స్టేట్ మూడో ర్యాంకు, వి.ఇందు 435/440 మార్కులతో స్టేట్ మూడో ర్యాంకు, టుబా ఫాతిమా 434/470మార్కులతో స్టేట్ నాలుగో ర్యాంకు, రింషా అనం 434/470 మార్కులతో స్టేట్ నాలుగో ర్యాంకు, వై.శ్రీనిత్య 434/440 మార్కులతో స్టేట్ నాలుగో ర్యాంకు సాధించినట్లు తెలిపారు.



## దూపల్లి లో బడిబాట కార్యక్రమం

**సూర్య రెంజల్**

మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా బడిబాట కార్యక్రమం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయురాలు వెంకటలక్ష్మి తెలిపారు. బుధవారం రెంజల్ మండలంలోని ధూపల్లి లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రధాన వీధులలో ప్రైమరీ మరియు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులను రాబోయే సంవత్సరానికి ఆరో తరగతిలో చదివేందుకు విద్యార్థులు పంపించేందుకై తల్లిదండ్రులు ఒప్పుకోవడం జరిగిందని తెలిపారు. భాషలో విద్యార్థులకు న్యాయమైన బోధన తోపాటు భోజనాన్ని మరియు ఇతర సాంస్కృతి కార్యక్రమాలపై తెలియపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు మండల అధ్యక్షుడు సోమలింగం గౌడ్, ఉపాధ్యాయులు ప్రభాకర్ సాయన్న కృష్ణ రాజేశ్వర్, రాములు, రాధా, సంధ్య, సురేష్, లక్ష్మి తదితరులు ఉన్నారు.

## రాత్రి వేళ కిరాణా దుకాణం తెరిచి ఉంచిన వ్యాపారికి జైలు శిక్ష

**సూర్య ఇందూర్:**



రాత్రి వేళ కిరాణా దుకాణం తెరిచి ఉంచిన వ్యాపారిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం అతడికి జైలు శిక్ష విధించిందని 2వ టౌన్ ఎస్ హెచ్ వో యాసీర్ అరాఫత్ తెలిపారు. షేక్ జుబేర్ అనే వ్యక్తి రాత్రి కిరాణా దుకాణం తెరిచి ఉంచడంతో అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరుపర్చామన్నారు. కేసు విచారణ చేపట్టిన న్యాయమూర్తి కిరాణా దుకాణం యజమాని జుబేర్ కు 4 రోజుల జైలు శిక్ష విధించిందన్నారు. వ్యాపారులు తమ దుకాణాలను నిర్ణీత సమయంలోగా మూసివేయాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని యాసీర్ అరాఫత్ స్పష్టం చేశారు.



## ఉగ్ర దాడికి నిరసన కొవ్వొత్తుల ర్యాలీ..

**సూర్య- నవీపేట్:**

జమ్మూ కాశ్మీర్ పహాల్గావ్ ఉగ్ర దాడికి వ్యతిరేకంగా బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఉగ్రదాడిలో మృతి చెందిన సుమారు 25 మంది హిందువులైన అమరులను స్మరిస్తూ నివాళులర్పించారు. ఉగ్రవాదానికి, పాకిస్తాన్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ద్యాగ సరిన్ మాట్లాడుతూ. పెహల్గామ్ ఉగ్రదాడిని సభ్య సమాజం తీవ్రంగా ఖండిస్తుందిన్నారు. ఈ దాడి సిగ్గుమాలిన చర్యగా సమాజం చూస్తోందన్నారు. పాకిస్తాన్ అసమర్థ నాయకత్వానికి ఈ ఘటన పరాకాష్ట అని, ప్రశాంతంగా ఉన్న జమ్ము కాశ్మీర్ లో పాకిస్తాన్ నిప్పులు పోస్తుందని మండిపడ్డారు. భారతను దెబ్బతీయాలని చూస్తే పాకిస్తాన్ తప్పక మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని, దోషులను విడిచిపెట్టి ప్రసక్తే లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వంశీ మోహన్, రాజేందర్ గౌడ్, ఆనంద్, రామకృష్ణ, రాజశేఖర్, రాము తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి చట్టంతో రైతుల భూ సమస్యలు పరిష్కారం

**- సబ్ కలెక్టర్ కిరణ్మయి**

**సూర్య,లింగంపేట్**



భూభారతి చట్టంతో రైతుల సమస్యలు అన్ని పరిష్కారం అవుతాయని జిల్లా సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు.ఆమె బుధవారం లింగంపేట్ మండలంలోని జల్లిపల్లి గ్రామాన్ని సందర్శించి భూభారతి సదస్సులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూభారతి చట్టంతో భూ సమస్యలు ఏవి ఉన్న తమ అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. భూ సమస్యలకు సంబంధించిన వివరాలు స్పష్టంగా దరఖాస్తు ఫారంలో రాయాలన్నారు.ప్రతి భూ సమస్య ఒకటి,రెండు నెలల్లో పరిష్కారం అవుతాయని తెలిపారు. ధరణికి,భూభారతి చట్టంపై తేడాను ప్రజలకు అవగాహన కల్పించారు. జల్దీపల్లిలో 18 రాంపూర్ లో 68 దరఖాస్తులు వచ్చినట్లు తహసిల్దార్ సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మన్నె ప్రభర్,రెవెన్యూ ఇన్స్పెక్టర్ కిరణ్,సీనియర్ అసిస్టెంట్ భరత్, జూనియర్ అసిస్టెంట్లు రవి,సాయిలు,లక్ష్మణ్ తహసిల్దార్ బృందం పాల్గొన్నారు.

## పలు శుభకార్యాలలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజిత వెంకటరామిరెడ్డి

**సూర్య ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్ దేవేందర్ కుమార్తె వివాహం ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్లో బుధవారం ఘనంగా జరిపారు వారి ఆహ్వానం మేరకు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజిత వెంకటరామిరెడ్డి ,సొసైటి వైస్ చైర్మన్ మత్తామాల ప్రశాంత్ గౌడ్ లు వధూవరులను ఆశీర్వదించారు అనంతరం అన్నాసాగర్ గ్రామానికి చెందిన కృష్ణ రెడ్డి కుమార్తె వివాహం లింగంపేట్ ఫంక్షన్ హాల్ ఘనంగా జరిపారు వారి వివాహానికి విచ్చేసి వారికి కూడా శు భాకాంక్షలు తెలియజేసారు. అదేవిధంగా, పోసంపల్లి గ్రామానికి చెందినటువంటి మాజీ కోఆప్షన్ మేంబర్ లింగం కుమారుని వివాహం గాంధారి మండల కేంద్రంలో మారుతి ఫంక్షన్ హాల్లో ఘనంగా జరిపారు అక్కడికి కూడా హాజరై వధువరులని ఆశీర్వదించారు వీరి వెంట మాజీ జెడ్పిటిసి సామెల్ , మాజీ జడ్పిటిసి ఉషా గౌడ్, పిఎసిఎస్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ గౌడ్ మాజీ సర్పంచ్ తిమ్మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సంతోశ్ , శకావత్ అలీ, ముజిబ్ ,యూత్ ప్రెసిడెంట్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు

## వరంగల్ సభను విజయవంతం చేయాలి

**- మాజీ ఎమ్మెల్యే సురేందర్**

**సూర్య,లింగంపేట్**

ఈ నెల 27న వరంగల్ లో జరిగే బిఆర్ఎస్ పార్టీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ శ్రేణులకు ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పిలుపునిచ్చారు.ఆయన బుధవారం లింగంపేట్ మండల కేంద్రంలోని జిఎన్ఆర్ గార్డెన్ లో బిఆర్ఎస్ ముఖ్య శ్రేణులకు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అచ్చే ప్రభుత్వం బిఆర్ఎస్ పార్టీ దేనని ప్రతి కార్యకర్త పార్టీకి కష్టపడి పని చేయాలని అన్నారు.కాంగ్రెస్ పార్టీని జనాలు నమ్మే పరిస్థితి లేదన్నారు.బిఆర్ఎస్ కార్యకర్తలు, పార్టీ శ్రేణులు సంయమనంతో ఉండాలన్నారు. వరంగల్ సభకు ప్రజలు స్వచ్ఛందంగా రావడానికి ముందుకొస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దివిటీ రమేష్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అశోక్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి,ముదాం సాయిలు,గన్ను నాయక్,రూప్ సింగ్, నాయకులు,కార్యకర్తలు, పాల్గొన్నారు

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో ముగ్గురికి జైలు శిక్ష

**సూర్య రెంజల్ :**

మండలంలోని సాటాపూర్ ఎక్స్ రోడ్లో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో ముగ్గురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పట్టుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు వివరాల్లోకి వెళ్తే చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా మహారాష్ట్రలోని బెంగళూరు గ్రామానికి చెందిన శివాజీ రౌటే, తాడిబిలోలి గ్రామానికి చెందిన షేక్ హైదుకు రెండు రోజుల జైలు శిక్ష, మరో వ్యక్తి వీరన్న గుట్ట ప్రాంతానికి చెందిన వీరభత్తుల సాయిలు కు ఒకరోజు జైలు శిక్షలను సెకండ్ క్లాస్ జడ్జి శ్రీ శేష తల్ప సాయి విధించినట్లు ఎస్సై తెలిపారు. ఇంకొకరికి నాలుగు వేల రూపాయల జరిమానా విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## పలు శుభకార్యాలలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజిత వెంకటరామిరెడ్డి

**సూర్య ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్ దేవేందర్ కుమార్తె వివాహం ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్లో బుధవారం ఘనంగా జరిపారు వారి ఆహ్వానం మేరకు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజిత వెంకటరామిరెడ్డి ,సొసైటి వైస్ చైర్మన్ మత్తామాల ప్రశాంత్ గౌడ్ లు వధూవరులను ఆశీర్వదించారు అనంతరం అన్నాసాగర్ గ్రామానికి చెందిన కృష్ణ రెడ్డి కుమార్తె వివాహం లింగంపేట్ ఫంక్షన్ హాల్ ఘనంగా జరిపారు వారి వివాహానికి విచ్చేసి వారికి కూడా శుభాకాంక్షలు తెలియజేసారు. అదేవిధంగా, పోసంపల్లి గ్రామానికి చెందినటువంటి మాజీ కోఆప్షన్ మేంబర్ లింగం కుమారుని వివాహం గాంధారి మండల కేంద్రంలో మారుతి ఫంక్షన్ హాల్లో ఘనంగా జరిపారు అక్కడికి కూడా హాజరై వధువరులని ఆశీర్వదించారు వీరి వెంట మాజీ జెడ్పిటిసి సామెల్ , మాజీ జడ్పిటిసి ఉషా గౌడ్, పిఎసిఎస్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ గౌడ్ మాజీ సర్పంచ్ తిమ్మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సంతోశ్ , శకావత్ అలీ, ముజిబ్ ,యూత్ ప్రెసిడెంట్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు

## వరంగల్ సభను విజయవంతం చేయాలి

**- మాజీ ఎమ్మెల్యే సురేందర్**

**సూర్య,లింగంపేట్**

ఈ నెల 27న వరంగల్ లో జరిగే బిఆర్ఎస్ పార్టీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ శ్రేణులకు ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పిలుపునిచ్చారు.ఆయన బుధవారం లింగంపేట్ మండల కేంద్రంలోని జిఎన్ఆర్ గార్డెన్ లో బిఆర్ఎస్ ముఖ్య శ్రేణులకు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అచ్చే ప్రభుత్వం బిఆర్ఎస్ పార్టీ దేనని ప్రతి కార్యకర్త పార్టీకి కష్టపడి పని చేయాలని అన్నారు.కాంగ్రెస్ పార్టీని జనాలు నమ్మే పరిస్థితి లేదన్నారు.బిఆర్ఎస్ కార్యకర్తలు, పార్టీ శ్రేణులు సంయమనంతో ఉండాలన్నారు. వరంగల్ సభకు ప్రజలు స్వచ్ఛందంగా రావడానికి ముందుకొస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దివిటీ రమేష్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అశోక్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి,ముదాం సాయిలు,గన్ను నాయక్,రూప్ సింగ్, నాయకులు,కార్యకర్తలు, పాల్గొన్నారు